క్లుప్తంగా

జీవీఎంసీ కమిషనర్‌తో వీఎంఆర్‌డీఏ చైర్మన్ భేటీ



జీవీఎంసీ కమిషనర్‌తో భేటీ అయిన వీఎంఆర్‌డీఏ చైర్మన్

డాబాగార్డెన్స్: వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎంవీ ప్రణవ్ గోపాల్ తొలిసారిగా జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ అభివృద్ధిలో భాగంగా వీఎంఆర్‌డీఏకి సహకారం అందించాలని కోరారు. వీఎంఆర్‌డీఏ చేపడుతున్న ప్రాజెక్టుల గూర్చి వివరించారు. జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపై కార్యక్రమాలపై వీరిద్దరూ చర్చించారు.

మహిళలకు చీరలు అందజేత



మహిళలకు చీరలు అందజేస్తున్న వంకాయల సన్యాసిరాజు

డాబాగార్డెన్స్ : ప్రముఖ సంఘ సేవకుడు, కనక మహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) పలువురు వివేకానంద సంస్థ మహిళలకు మంగళవారం చీరలు అందజేశారు. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, నిత్యం సేవలందిస్తున్న మహిళా సభ్యులకు ఏటా వివేకానందుని జయంతోత్సవాలను పురస్కరించుకొని చీరలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ నిత్యం సేవలందిస్తున్న సేవామూర్తులు, తోబుట్టువులకు చీరలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వంకాయల రవికుమార్, ఉమాదేవి, రాణి, సావిత్రి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

వర్చువల్ ల్యాబ్స్‌పై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సైన్స్ అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : వర్చువల్ ల్యాబ్స్‌కి సంబంధించి సైన్స్ విభాగాల అధ్యాపకులకు విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ వర్చువల్ ల్యాబ్స్‌ని విరివిగా వినియోగిస్తే విద్యార్థులు, అధ్యాపకులకు చాలా సమయం ఆదా అవుతుందన్నారు. అమృత విశ్వవిద్యాలయానికి చెందిన ప్రాజెక్ట్ మేనేజర్, రీసెర్చ్ అసోసియేట్‌తోపాటు కళాశాల నోడల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పీఎల్ శరణ్య, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ సంతోషి అనూష, సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో ప్రీ కిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంగళవారం కేజీహెచ్ నర్సింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మోహర్, ఏఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎన్.అప్పారావు, గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, కల్పన, రమణమ్మ, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు గంగాభవానీ, జిల్లా కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, సిబ్బంది ఇందిర, వంశీ, గౌరి, లిల్లీ గ్రేస్, పద్మజ, వినీల తదితరులు పాల్గొన్నారు. క్యాండిల్ లైటింగ్ నిర్వహించారు. పేద రోగులకు బెడ్ షీట్‌లను అధ్యక్షురాలు గంగాభవానీ పంపిణీ చేశారు.

అంతా మా ఇష్టం..!



బస్సులు నిలిపే ప్రాంతంలో ప్రైవేట్ వాహనాలు



వన్‌టౌన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న ఆర్టీసీ సర్వీసులు



నిలువ నీడ లేని బస్టాప్

- వన్‌టౌన్‌లో ఇష్టారాజ్యంగా ఆర్టీసీ బస్సుల నిలిపివేత
- మరోవైపు బస్సులు నిలిపేచోట ప్రైవేట్ వాహనాలు
- అడ్డదిడ్డంగా పార్కింగ్‌తో స్తంభిస్తున్న ట్రాఫిక్
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు అవస్థలు

డాబాగార్డెన్స్ : ఆర్టీసీ సిటీ బస్సుల డ్రైవర్ల నిర్లక్ష్యం వాహనచోదకులకు ఇబ్బందిగా పరిణమించింది. రోడ్లపై బస్సులను అడ్డదిడ్డంగా పార్క్ చేసేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే... అంతా మా ఇష్టం అంటూ సమాధానమిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్ల తీరు ప్రజలకు కష్టాలు తెచ్చిపెడుతోంది. వారి నిర్లక్ష్యంతో వాహన చోదకులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. బస్సులను డ్రైవర్లు అడ్డదిడ్డంగా పార్క్ చేసి వెళ్లిపోతుండడంతో... ఆ సమయంలో అటుగా వచ్చే వాహనదారులు దారి కోసం అవస్థలు పడుతున్నారు. రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో ఆవేదన చెందుతున్నారు. ఎన్నిమార్లు చెప్పినా డ్రైవర్లు వినడం లేదని వాపోతున్నారు. చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను, ట్రాఫిక్ పోలీసులను కోరుతున్నారు.

తెల్లవారి నుంచి రాత్రి వరకూ రద్దీగానే...

వన్‌టౌన్ క్వీన్‌మేరీ పాఠశాల జంక్షనే ఆర్టీసీ బస్సులకు చివరి స్టాపు. నిత్యం వంద వరకు బస్సు సర్వీసులు పాతపోస్టాఫీసు నుంచి నగరం నలుమూలలకు ప్రయాణిస్తాయి. సింహాచలం, పీఎం పాలెం, మధురవాడ, వాల్తేర్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి సర్వీసులు ఉన్నాయి. ఉదయం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఇక్కడ బస్సులతో సందడిగా ఉంటుంది. కోటవీధి, ఫెర్రీరోడ్డు, కన్వేయర్ బెల్ట్ వీధి, కదిరి దానప్పవీధి, థామ్సన్ స్ట్రీట్, అంబుసరంగ్ వీధి, తదితర ప్రాంతాల ప్రజలు ఈ జంక్షన్ మీదుగానే ప్రయాణించాలి. క్వీన్‌మేరీ, సెయింట్ అలోసిస్, పోర్టు బేసిక, పోర్టు ఉర్దూ పాఠశాల, సెయింట్ జాన్స్ తదితర విద్యా సంస్థలు, మూడు మతాలకు చెందిన దేవాలయాలు, గుడులు, చర్చిలు, షిప్పింగ్ కంపెనీలు ఈ ప్రాంతంలో ఉండడంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. వీరిలో అధికశాతం విద్యార్థులు, ఉద్యోగులే. వీరంతా ఇక్కడ నుంచే నగరం నలుమూలలకు రాకపోకలు సాగించాలి. కానీ ఆర్టీసీ డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడే బస్సులను పార్క్ చేసి వెళ్లిపోతున్నారని స్థానికలు వాపోతున్నారు. దీని వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని, విద్యార్థులు బస్సుల మధ్య నుంచి భయంభయంగా పాఠశాలలకు వెళ్తున్నారని చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా దీనిపై దృష్టి సాధించడం లేదని, బస్సులను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్ వాహనాల తీరూ అంతే..

ఇదిలా ఉండగా ఆర్టీసీ బస్సులు నిలిపే చోటే ప్రైవేట్ వాహనాలు ఇష్టానుసరంగా పెట్టేస్తున్నారని ఆర్టీసీ సిబ్బంది సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. అసలే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువని... ఆర్టీసీ బస్సులు నిలిపే చోటే ప్రైవేట్ వాహనాలు కూడా నిలిపేస్తున్నారని, అడిగితే ఎదురు తిరుగుతున్నారని సిబ్బంది వాపోతున్నారు. మరోవైపు సిటీ పరిధిలో ట్రాఫిక్ నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా సమయానికి బస్సులు వచ్చే అవకాశం ఉండడం లేదు. ప్రయాణికులు తమ గమ్యాన్ని చేరుకోవాలంటే ఆ బస్సులు వచ్చే వరకు వేచి ఉండాల్సిందే. అది మండుటెండైనా.. వర్షం కురిసినా.. చలిగాలులు వీచినా వేచి ఉండాల్సిందే. అయితే ఇక్కడి బస్టాప్ వద్ద షెల్టర్ లేకపోవడంతో ఎక్కడుండాలో తెలియక ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు లబోదిబోమంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడంతో పాటు బస్సుల కోసం నిరీక్షించేందుకు షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న మెరైన్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు




ఎగ్జిబిషన్‌లో పరికరాలను తిలకిస్తున్న విద్యార్థులు



స్టాల్స్ పరిశీలిస్తున్న సందర్శకులు

మహారాణిపేట: భారతీయ మత్స్య పరిశోధన సంస్థ విశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మెరైన్ ఎగ్జిబిషన్, సముద్ర మత్స్య వనరులు, మెరైన్ ప్లాస్టిక్/ తెగిన వలల మీద అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయం 1,2 విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని ఫిషింగ్ హార్బర్‌లోని జెట్టీల్లో నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్-2 సీహెచ్ శ్రీనివాసులు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించిన ప్రదర్శన, అవగాహన సదస్సులో వివిధ రకాలైన మత్స్య వనరులు, కృత్రిమ చేపల ఆవాసాలు, నౌకలో ఉన్న పరికరాలు, నావిగేషన్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, లైఫ్ సేవింగ్ అండ్ అగ్నిమాపక ఉపకరణాలు, మత్స్య సంపద అభివృద్ధికి దోహదపడే అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి గోస్ట్ ఫిషింగ్ వలలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్రం కలుషితం కావడంతోపాటు మత్స్య సంపదకు జరుగుతున్న నష్టాలను వివరించారు. సముద్ర మత్స్య వనరులపై భారతీయ మత్స్య పరిశోధన శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మొత్తం మూడు వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 16వ రోజు మంగళవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన చేశారు. 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అష్టదళ పద్మారాధన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో...

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి చంద్ర రాజకుమారి



చంద్ర రాజకుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రతినిధులు

అల్లిపురం: మహిళా సమాఖ్య నాయకురాలిగా ఎన్నో ఉద్యమాల్లో పనిచేసి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా చంద్ర రాజకుమారి నిలిచారని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి అన్నారు. చంద్ర రాజకుమారి ఆరో వర్ధంతి సందర్భంగా అల్లిపురం సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సంతాప సభలో ఆమె పాల్గొన్నారు. ముందుగా రాజకుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎంఏ బేగం, దేముడమ్మ, అన్నపూర్ణ, అరుణ, రజిని, జి.జయ, పద్మ, భవాని, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహంలో అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న జగన్నాథరావు

సీతమ్మధార: రాష్ట్రంలో ప్రగడ ఇంటి పేరుతో ఉన్న కుటుంబ సభ్యులందరూ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ప్రగడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రగడ జగన్నాథరావు అన్నారు. మంగళవారం ట్రస్ట్ మొదటి సేవా కార్యక్రమంగా ద్వారకా నగర్‌లోని ఏయూటీడీ -జీవీఎంసీ డే-నైట్ నిరాశ్రయ వసతీగృహంలో 85 మంది అభాగ్యులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగించిన నిరాశ్రయులతో కానిస్టేబుళ్లు

సీతమ్మధార : చలి తీవ్రత పెరిగి చాలా మంది నిరాశ్రయులు రైల్వేస్టేషన్లో తలదాచుకుంటున్నారు. ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు ఇచ్చిన సమాచారంతో ఏయూటీడీ సిబ్బంది అక్కడికి వెళ్లి ఐదుగురు పురుషులు, ఓ మహిళను రెస్క్యూ చేసి షెల్టర్‌కు తరలించారు. శ్రీకాకుళానికి చెందిన రామారావు, బీహార్‌కు చెందిన అనీల్ కుమార్, కర్ణాటకు చెందిన ఆంజనేయ, జార్ఖండ్‌కు చెందిన సంజయ్, కోల్‌కతాకు చెందిన హరిధర్, ఒడిశాకు చెందిన ఆదివాసీ మహిళ కాంతమ్మ షెల్టర్‌కు తరలించారు. వీరంతా భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిని ఆయా కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ సిబ్బంది తెలిపారు.

12 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని మంగళవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు సిబ్బందితో కలిసి మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఢిల్లీకి చెందిన మొహమ్మద్ ముజామ్మిల్ అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పెన్షన్‌తో ఉద్యోగుల జీవనానికి భరోసా



జీవీఎంసీ గాంధీ పార్కులో పెన్షనర్స్

సీతమ్మధార : జీవీఎంసీ గాంధీ పార్కులో 'పెన్షనర్స్ డే' వేడుకలను ఏపీ ఆర్‌పీఏ విశాఖ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందుస్థాన్ షిప్‌యార్డు, జింక్, హెచ్‌పీసీఎల్, ఆర్టీసీ, బీహెచ్‌ఈఎల్ వంటి వివిధ సంస్థల నుంచి పెన్షనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.ఎం.కుమార్ మంగలం మాట్లాడుతూ పెన్షనర్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. నకార కేసులో న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్ తీర్పు అంశాలను తెలియజేశారు. అనంతరం ఏపీ ఆర్‌పీఏ గౌరవ అధ్యక్షుడు బి.టి. మూర్తి మాట్లాడుతూ 'పెన్షన్ అంటే దానం కాదని, ఉద్యోగ విరమణ తర్వాత గౌరవప్రదమైన జీవనానికి హక్కు' అని, భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. కనీస పెన్షన్‌ను 9 వేలు ప్లస్ డీఏతో చెల్లించాలని కోరారు. భార్య, భర్తకు వైద్య సదుపాయాలు కల్పించాలని, రైల్వే ప్రయాణంలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షనర్స్ వి.నర్సింగరావు, బుగత అప్పారావును తిరుపతిరావు, అప్పారావు, ఎస్.చలపతిరావు, సూర్యచంద్రరావు సత్కరించారు. ఏపీఆర్‌పీఏ కోశాధికారి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్లు సంఘం జిల్లా అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు , ప్రధాన కార్యదర్శి పి. కృష్ణమూర్తి, ఉపధ్యక్షుడు డి.ఎస్.ఎన్ మూర్తి, గౌరవాధ్యక్షుడు సాయిబాబా, ఆర్గనైజేషన్ సెక్రటరీ రమణమూర్తి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన శూన్యం



సదస్సులో వినతి పత్రం అదజేస్తున్న వేంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

అల్లిపురం: వేంకటేశ్వరమెట్ట-1, సచివాలయంలో మంగళవారం జరిగిన జీవీఎంసీ 32, 33, 34 వార్డుల రెవెన్యు సదస్సుకు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. రెవెన్యూ సదస్సు జరుగుతున్నట్టు సమాచారం లేకపోవడంతో ప్రజలు పెద్దగా హాజరుకాలేదు. అధికారులు, ఇద్దరు కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది మినహా ఎవరు లేకపోవటం విశేషం. సదస్సులో మహారాణిపేట తహసీల్దార్ జిలానీ, వీఆర్‌వో రాజేష్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మీ, ఎండోమెంట్ అధికారి ప్రసన్న లక్ష్మి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రధానంగా వేంకటేశ్వరమెట్ట 1460, 1261 భూసమస్యపై వేంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి ప్రసాద్, భీశెట్టి శ్రీనివాసరావు, శరగడం మోహన్, కోరిబిల్లి శ్యామ్ హౌస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, విల్లూరి డాక్టర్ చక్రవర్తి ఫిర్యాదు చేశారు. సదస్సులో మొత్తం 21 వినతి పత్రాలు రాగా వాటిలో 15 ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం 6 వినతులు అందాయి.

30 సంవత్సరాలుగా ఉంటున్నాం



గత 30 ఏళ్లుగా జీవీఎంసీ 34వ వార్డు మున్సిపల్ కాలనీలో పక్కా రిజిస్ట్రేషన్‌తో, అన్ని రకాల పన్నులు కట్టుకుంటూ నివసిస్తున్నా. ఇటీవల మా అబ్బాయికి ఆస్తి బదిలీ చేద్దామని రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళితే మా స్థలంతో పాటు మరో నాలుగు ఇళ్లు 22ఎలో ఉన్నాయని చెప్పారు. ఎప్పుడు 22ఎలో పెట్టారో తెలియడం లేదు. సమస్య పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుకు వచ్చాం. అయితే ఇక్కడ వినతి పత్రం తీసుకోరట. ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు.

– మహ్మద్ అన్వర్, మున్సిపల్ కాలనీ, 34వ వార్డు

సిటూ నాయకురాలు శారదకు ఘన నివాళి



శారద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిటూ నాయకులు

డాబాగార్డెన్స్: బలమైన కార్మిక పోరాటాలు నిర్వహించడమే శారదకు నిజమైన నివాళి అని పలువురు సిటూ నాయకులు పేర్కొన్నారు. సిటూ నాయకురాలు శారద 20వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. సిటూ నాయకులు జ్యోతీశ్వరరావు, వై రాజు తదితరులు శారదా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ శారద విద్యార్థి దశ నుంచే పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. జిల్లాలోనే తొలిసారిగా శ్రామిక మహిళను ఆర్గనైజ్ చేయడం కోసం అంగన్వాడీ సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. 20 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురై శారద మరణించారన్నారు. సిటూ నాయకులు జ్యోతీశ్వరరావు, పోలేశ్వరరావు, మణి, వై రాజు , ఎం సుబ్బారావు, అప్పలరాజు, కృష్ణ, కుమారి, చంద్రశేఖర్, సూరీడు, ప్రదీప్, జీవీ రమణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, తదితరులు

మహారాణిపేట: వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారులు, ఇతర అధికారుల సమక్షంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవలు, గర్భిణుల సేవలు, సపోర్ట్ సూపర్ విజన్, వ్యాధి నిరోధక టీకాలను సిబ్బందికి వివరించారు. కిల్కారి సేవలపై ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణులక పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, డాక్టర్ ఎన్.వి.సమత, జిల్లా సమన్వయకర్త కె.ధర్మేంద్ర, మణికుమారి, ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు

మహారాణిపేట: మాజీ సైనికులు, వితంతువులకు స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు మంగళవారం జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం ఎంప్లాయిమెంటు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి బి.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మాజీ సైనికులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు బయోడేటాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ ఏడీ పద్మవతి, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంటు ఆఫీసర్ చాముండేశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం, మాజీ సైనికులు, వితంతువులు తదితరులు పాల్గొన్నారు.